ఓడలు బళ్ళు

"ఒదినా! నాలుగు వంకాయలున్నాయిటమ్మా? అర్థంతరంగా ఒక చుట్టం దిగాడీవేళ...సాయంత్రానికి గానీ ఆయనగారు రారు...ఎవరింటికెళ్లినా అయ్యవార్లంగారి నట్టిల్లేగదా! ఉత్త నిప్పచ్చు మొహాలు..మనిళ్లల్లో తప్ప అంతా ముందరే మొండిచెయ్యి చూపించేస్తారు!" అంటూ వచ్చింది ఎదురింటి వెంకాయమ్మగారు.

"ఏమిటో, ఒదినా! కరువుకాలం గదా! కాలక్షేపం చెయ్యాలిగానీ మరి..." అని ముందలించింది మాణిక్యమ్మగారు.

"అయినా, ఏమిటి! మరీ అంత మోటుతనమా? మొన్న పిల్లి పాలు త్రాగేసింది గదా అని వెనకవీధివారింటికి మజ్జిగకెడితే, వాళ్ళమ్మాయి 'ఒక్కపూటకి మజ్జిగ లేకపోతే యేం! మరణిస్తారా!' అనడిగింది. మళ్ళీ గుమ్మం తొక్కమనుండా చెప్పూ? అవసరం గనుకనూ...పాడిగలవాళ్ళు గదా వనిగానీ...లేకపోతే చస్తే అడుగుతామటమ్మా? మ్రగ్గి మాడిపోవలసిందే గానీ! పాడికి దిష్టితగులుతుందని ఎవరికీ ఇంత మజ్జిగచుక్కైనా పొయ్యరమ్మోయ్! అంతా కుడితితొట్టెలో పోసుకుంటారు గానీ చంటిపిల్లకైనా ఇన్నిచుక్కలు పొయ్యరు. కల్పవృక్షంలాంటి మీరు కనికరించబట్టి గానీ?..."

"ఏమిటో ఒదినా! కలిగితే కాసిన్ని పొయ్యటానికి కష్టమా! ఇదిగో వంకాయలు...పెరుక్కి గిన్నె తెచ్చుకోలేదూ! పోనీగానీ...మళ్ళీ గిన్నెమాత్రం వెంటనే పంపేం?"

"అయ్యో! ఎంతమాటన్నావు? అని అమృతవాక్కు లాలాపించి నెమ్మదిగా నడిచింది. వెంకాయమ్మ"

వెంకాయమ్మగార్ని సాగనంపాలని సావిట్లో కెళ్ళేటప్పటికి గుమ్మంలో గుఱ్ఱబ్బండి చప్పుడైంది. తెరిచిన తలుపు తెరిచినట్లే ఉంచేసి వచ్చినచుట్టాల్ని ఆహ్వానించింది. బండిదిగి "ఏమమ్మోయి, అత్తయ్యా! జ్ఞాపకమున్నామా?" అని పలకరించాడు అతిథి.

"ఏమిటోయ్, ఇలా దిగావ్! ఇంటి దగ్గరంతా క్షేమమేనా" అని కుశల ప్రశ్న వేసింది మాణిక్యమ్మగారు.

"అదిగో, అమ్మా, అక్కయ్యా అందరూ దిగారు."

"ఏరీ? ఏమిటి విశేషం? ఎన్నడు రానివారు..."

"రాకేం? నేనేం ఎప్పుడూ వస్తూనే ఉన్నాం...నువ్వే ఎప్పుడూ కూపస్థమండూకంలా కదలవు గానీ. అమ్మకి అజీర్ణం, అక్కకి కడుపునొప్పిట ఆస్పత్రిలో జాయిన్ చేద్దామని..."

ఇంతట్లోకే ఆడబడుచు తోటికోడలు రాజమ్మగారు, ఆవిడ అమ్మాయి అలివేలు అడుగుపెట్టారు. అందర్నీ ఆనందంతో ఆహ్వానించింది మాణిక్యమ్మగారు. భోజనాలుచేసి తాంబూలాలు నములుతూ కాలక్షేపానికి ఉపక్రమించారు. బంధువులు.

"ఏమిటండీ ఒదినగారు! అమ్మాయికి సుస్తీ ఏమిటి?"

"కాపరానికివెళ్లి పదేళ్లైందా, కడుపుని నాలుక్కాయలు కాయకపోతే మా సెకడుపునొప్పి పట్టుకుందమ్మా. ఆ మాయ కడుపునొప్పొస్తే కన్నూ మిన్నూ ఎరక్కుండా గిజగిజ లాడిపోతుంది బిడ్డ. ఆస్పత్రిలో చేర్చి ఆపరేషన్ చేయించాలని తీసుకు వచ్చాను. చేబ్రోలుకి కాస్త చేరువగదా అని మనవాళ్లున్నారు గదా అని ఇక్కడే చేయించాలనుకుంటున్నాను. రెండు నెలలుండాలాయె ఏ సత్రం ఏర్పాటు చేసుకోవాలో చెప్పు......"

"అయ్యో! ఎంతమాటన్నారు!! ఏం పట్టుకుపోతాం చెప్పండి వదినగారూ! మీ ఎత్తుధనం పోసినా మీరు మాయింటికెందుకొస్తారు చెప్పండి! ఈ నెలలో మా అమ్మాయికి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాము కూడానూ. మీరుగూడా ఉండి ముద్దూ ముచ్చటా చూసి మాకు సహాయపడగలరు గదా అని సంతోషిస్తున్నాను."

"మీ ఆదరాభిమానాలుండాలి గానీ దానికేమిటి!"

ఇంతట్లోకే "పిన్నీ! పిన్నీ!!" అని పంతులు పిలిచాడు.

"ఏమిటోయ్; పంతులూ! తిండీ తిప్పలూ లేకుండా అదే తిరుగుడా చెప్పు! గంట రెండైంది. కడుపుమాడు ఎలా అప్పుడంలా అంటుకుపోయిందోనూ! కోడికూతకి బయలుదేరావు. అపరాహ్ణం తిరిగినా ఆహారం లేకుండా ఏం తిరుగుడు?" అని ఆదరించింది మాణిక్యమ్మగారు.

"ఔను పిన్నీ! ఎంత తిరిగినా అంతు లేకుండా ఉంది ఈ ఉద్యోగసమస్య. స్కూలుఫైనలు ప్యాసై అప్పుడే ఐదేళ్లైంది. ...శని నెత్తిమీద తంతూంటే?...భాగ్యవంతుల్ని పాడుచేసిన వాళ్లూ నిర్భాగ్యుల్ని బాగుచేసే వాళ్ళుంటారా ఈ ప్రపంచంలో ...ఈ ఉద్యోగం కోసరం ఈ వేళటికి ఈడొచ్చి ఆర్నెల్లైంది. కానీ...ఎక్కడా... ఖాళీలు లేవనే కబురు. ఆఖరుకి బస్సు కండక్టరుఉద్యోగానికి బయలు దేరాను. మూడునెల్లనుంచీ వెట్టిచాకిరీచేసి ... పట్టరానివాళ్ళ కాళ్ళు పట్టుకుని...పెళ్ళాం పుస్తె అమ్మి లైసెన్సు తెప్పించుకుంటే... బ్రాహ్మణులకివ్వమన్నారు. ఆఖరికి అధికారిచుట్టూ తిరగ్గా తిరగ్గా ఇరవైరోజుల నుంచీ తిప్పితిప్పి ఈవేళ డిపాజిట్ నూటయాభై రూపాయలు ముందెవరుకడితే వాళ్లకిస్తానని వాగ్దానం జేశాడు. రేపు మధ్యాహ్నం పన్నెండుగంటలలోపుగా ఎవరు ముందరకడితే వాళ్ళదే ఛాన్సట. ఇంటికి వెళ్ళడానికికూడా వ్యవధిలేదు. వెళ్ళినా...వెంటనే డబ్బు దొరుకుతుందని నమ్మకమేమిటీ? ... ఇప్పటికే నాన్నకి ఊరంతా అప్పు. ఇంకెలా అప్పు పుడుతుంది? దొరక్క దొరక్క ఆ కాస్త... అంత గొప్ప ఉద్యోగం దొరుకుతే దానికైనా కక్కుర్తి పడడానికి దారిలేకపోతూంది. తెల్లవారితే తన్నుకుపోదామని గద్దల్లా కనిపెట్టుకు కూర్చున్నారు. డబ్బు కోసరం భగీరథప్రయత్నాలు సాగిస్తు

.NAS 82

న్నారు. దరిద్రదేవతకి దాహం ఎక్కువైపోయి దాసుల్ని దహనం చేసేస్తోంది. ఉద్యోగానికి ముందర లంచం యాభై, తర్వాత డిపాజిట్ నూటయాభై. మిమ్మల్నే కాళ్ళు పట్టుకోడం తప్ప నాకు వేరేగతి లేదు. ఆ కాస్త పుణ్యంకట్టుకుని మమ్మల్నుద్ధరించావా?...నీ పేరు చెప్పుకుంటాం. ఒక ఇల్లు నిలబెట్టినదానవౌతావు......" అని దీనాలాపాలు ఆలపించాడు. మాణిక్యమ్మగారి జ్ఞాతి పంతులు. "నాయనా పెద్దనాన్నగార్నడగలేకపోయావా?"

"చిటిపెళ్ళి తలపెట్టుకున్నారు గదాని సిగ్గేస్తూంది పిన్నీ! ఇప్పటికి ఉద్యోగం వంకతో ఐదారుసార్లు ఐదారు వందలు తగలేశాను...ఏ మొహంపెటు కడగనూ...?"

"అయినా పెద్దనాన్నగారు ఎల్లుండి దాకా రారు...సరేకానీ...ఇదిగో ఈ జిగినీ గొలుసు తాకట్టుపెటి రెండువందలు తెచ్చుకో... పెద్దనాన్నగారు వచ్చాక అడిగి యిస్తాను, విడిపించేద్దువుగాని..." అని ఆరు కాసుల జిగినీగొలుసు పంతులికి అర్పించింది మాణిక్యమ్మగారు.

"పిన్నీ! నీ ఋణం తీర్చుకోలేనమ్మా నా చర్మం చెప్పులు కుట్టియిచ్చినా! నా మొదటి జీతం నీకే బహుమతి...నువ్వు మా పాలిటి కామధేనువు. మా కులవేల్పువి. ఈసారి మాకు అమ్మాయి పుడితే నీ పేరెట్టుకుంటాను" అని కళ్ళనీళ్ళలో కాళ్ళుపట్టుకుని నీతివాక్యాలతో నిష్క్రమించాడు నిర్మొహమాటంగా పంతులు భోంచేసి.

బాపిరాజుగారు ప్రసిద్ధికెక్కిన ప్లీడరు ఆ ఊళ్ళో. పిత్రార్జితం పిసరంతైనా లేకపోయినా ప్రాక్టీసు బాగుండడంవల్ల భాగ్యవంతుడు కాగలిగాడు. ఆయన పెద్ద కుటుంబీకుడు కాకపోయినా భాగ్యవంతుడవడంవల్ల, బంధువర్గమంతే బాధ్యత నెత్తిన పెట్టుకోవడంవల్ల బంధువర్గాని కెక్కడా ఎడబాటంటూ ఉండేదికాదు. అన్నపూర్ణ సత్రంలాగ ఎప్పుడూ గడప ఎక్కేవారికి దిగేవారికి ఎడతెరిపి లేకపోయేది.

వారాల బ్రాహ్మల కెక్కడా నాగా ఉండేదికాదు. బీదవిద్యార్థులకి జీతాలు కట్టేవారు. బాపిరాజుగారి ఆర్జనకి మాణిక్యమ్మగారి చాకిరీకి చుట్టాలరాకకి విసులు విరామము ఉండేదికాదు. ధర్మసత్రంలాగ ధనసత్రంలాగ ధనవంతులు, దమ్మిడీ లేనివాళ్లు, ఉద్యోగాలకోసరం వచ్చేవాళ్ళు, పెళ్ళిళ్ళ విషయమై వచ్చేవాళ్ళూ, రోగాలకొచ్చేవాళ్ళు, చదువులకొచ్చేవాళ్ళూ అందరూ కనబడేవాళ్లు. వంటవాళ్లు వడ్డిస్తూవుంటే షడ్రసోపేతంగా పంచభక్ష్య పరమాన్నాలు భుజిస్తూ, నిరంతరం నిప్పుమీద మరుగుతూన్న నీళ్ళతో అభ్యంగన స్నానాలాచరిస్తూ, హంసతూలికా తల్పంమీద శయనించి ఆనందిస్తూ అవసరాలు గడుపుకునే వారు.

ఆయన ఏకైక పుత్రిక చిట్టిపెళ్ళి నెల్లాళ్ళకి ముందునుంచి నిలవయ్యారు చుట్టాలు. ఇల్లు క్రిక్కిరిసలాడుతూ, బంధువులతోటి, చుట్టాలతోటి కిటకిటలాడుతూంది. ఆనందంతో అతి వైభవంగా పెళ్ళి జరిగింది. శీతాకల్యాణంలాగ వీధికి పందిళ్లేసి విస్తళ్ళు కట్టారు. ఆరు గ్రామాలనుంచి బ్రాహ్మణ వర్గం, ఘనాపాఠీలు, పనసలు చదువుకుంటూ, కుండలాలాడించుకుంటూ, శాలువ లెగదోసుకుంటూ, ముక్కుపొడుం పీల్చుకుంటూ, చేతికఱ్ఱ లాడించుకుంటూ, విభూతి పట్టీలుతీర్చి, బిళ్ళగోచీ లమర్చి, గుండెలనిండా గంధపుపూతలు పెట్టి, రుద్రాక్షలు గుండెలమీద నాట్యం చేస్తూండగా, తాటాకువిసనకఱ్ఱలతో విసురుకుంటూ తాంబూలాలు నములుకుంటూ, ముక్కుమాటలాడుకుంటూ బయలుదేరివచ్చి కల్యాణ మండపం అలంకరించారు. ఎవరికి దొరికిన సరకు వాళ్ళు తీసుకుపోతున్నారు.

వచ్చిన చుట్టాలంతా సుమారు నెల్లాళ్లకు పైగా మేసి పట్టుపుటాలు ధరించి పి వంటలతో సహా తిని వీరిల్లు గుల్లచేసి కదిలారు; అక్షింతలు వారి నెత్తిమీద చుట్టాలకి చుట్టలందలేదని, బంధువులకి లెటలేదని, ఇరుగు పొరుగువారికి పిలుపు లేదని కుళ్ళుమాటలాడారు. ఎవళ్ళకం పెత్తనం వాళ్ళు చెలాయించారు. "చు ల్నంతా ఎందుకలా చేరదీస్తాడు? పోత తినిపొయ్యే చుట్టాలేగానీ అక్కరకొ వాళ్ళెవరైనా ఉన్నారా? ఉన్నన్నా ఒళ్ళెరగకుండా విరజిమ్ముకోవడం, తరా కాళ్లుచాచుకు కూర్చుంటే ఎవరుద్దరిస్తా కాస్త వెనకాముందూ చూసుకోవాలి" బాపిరాజుగారి మేనమామ గొంతుక బ చేసుకున్నా, అది అరణ్యరోదనమయి అసూయాపరులానందించక పోయి ఆత్మబంధువులు అక్షింతలు జల్లి కార్యం నిరాఘాటంగా నిర్వర్తించా పెళ్ళికెళ్ళిన పెద్దలంతా ఆ నెల్లా పెళ్ళినిగురించే ప్రస్తావన చేశారు.

"మాణిక్యమ్మగారు మహా యిల్లాలం నమ్మా."

"మహా యిల్లాలేమిటి! మణిపూసలా

(55 వ-పేజీ చూడండి)



★ వీరులా - వారసులా ★

(21-వ పేజీ తరువాయి)

న్నంతా వూడదీసి, పికొయ్య కొయ్యను క్రమక్రమంగా, నీటుగా కత్తితో పగల కొట్టుతున్నాడు. స్వేదంతో అతని వళ్లంతా తడిసిపోయింది. తలగూడా చన్నీళ్లస్నానం చేసివచ్చినట్లుగా వుంది. వంటిమీద అంగవస్త్రం ముక్కే వున్నది. ఈ దృశ్యం చూడగానే మొదట నిశ్చేష్టురాలైనది. ఒక వేళ కోటిలింగం పిచ్చివాడు కాలేదుగదా అని భయంకరమైనయోచన వచ్చిందామెకు.

కోటిలింగం ఆమెవంక కన్నెత్తి గూడా చూడలేదు. అతని చూపు, మనస్సు ఆ విధ్వంసక క్రియలో లగ్నమైవున్నట్లు తోచినది. తాయారమ్మ భయాందోళనలు కోపజ్వాలలై రగుల్కొన్నవి.

"నీకేం పోగాలం వచ్చింది? పిల్లల నోటి ముందు తిండి తీస్తున్నావ్" అని పెద్దగా అరిచింది.

కోటిలింగం తల పైకెత్తి ఆమెవంక నిదానంగా చూసి—"నీకు తెలీదు గామోలు. తాత తాంబుర పగిలిపోయింది. ఈమగ్గంతో నాకు పనిలేదింక" అని బహు నెమ్మదిగా సమాధానం చెప్పాడు.

తాయారమ్మ రెచ్చిపోయింది.

"నీకు మతిబోయింది. మమ్మల్ని చంపి పారేయక పొయ్యావా గొంతులు పిసికి? ఈ అఘాయిత్యం ఎవరు చెప్పారు నీకు? ఆ ముసలి బైరాగి ముండాకొడుకుతో దిరిగి కొంప గోడు మర్చి యింటికి చేటు దెస్తావా?"

అప్పటికే మగ్గం నామరూపాలు లేకుండా పోయింది. అతను మాట్లాడకుండా మొద్దుకత్తిని ఆ శిథిలాలమీద పారేసి అపర శివుడు లయనృత్య వేదికనుండి తొలగినట్లు తొలగిపోయాడు వరండాలోకి. ఆ గోడవకు పిల్లలంతా లేచి గోల్లుమన్నారు. తాయారు పసికందుల్ని దగ్గరకు చేర్చుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

* * *

కోటిలింగం మొట్టమొదటిసారిగా వ్యవసాయ కూలీ - అయినాడు అతని అజీవితంలో. ఉయ్యాల లూగించిన చెయ్యి స్మశానవాటికలో గోరీలు త్రవ్వబోయింది. పూలు బెంచిన హస్తాలతో గులకరాళ్ళెత్తాలి అనుకొంటూనే మొదటిసారి జనుము కోతల కెళ్ళాడు. ఈ కాయకష్టంలో నీచత్వం వున్నదని అతనికి మొదటినుంచీ తోచింది. తన తోటవాళ్ళతో తానెందుకు కలియలేదో అతనికే తెలియదు. మగ్గం నాశనం చేసిననాటినుండీ అతను యితరుల జోక్యమే మానుకొన్నాడు. మానవులంటేనే అతని శరీరం ముడుచుకొనేది. ఒక్క శ్రీరాములుగారు తప్ప తాయారమ్మన్నా, తన బిడ్డలన్నాగూడా అతనికొ అసహ్యభావమే స్ఫురిస్తున్నది.

చేతులు తెగుతూ, నాలిక పీకుతూ, శిరస్సుమండుతూ-వేడెక్కిన కొడవలితో, కింద మేకులవంటి మోళ్ళు కాళ్ళకు గుచ్చుకొంటూండగా జనుము కొయ్యటం తేలిక పనిగాదనీ, దీనికీ సులువు తెలియాలనీ, తెలివిఉండాలనీ, యీ కష్టం ఎంత తక్కువదైనదని తను అనుకొన్నాదాని సులువు బలువులు ఎరగాలనీ అతను గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. తనతోటి కూలీలంతా పదిబారల ముందుండగా తనింకా వెనకనే తచ్చాడుతూ, బొబ్బలు పొక్కిన చేతులలో కొడవలి మార్చుకుంటూ గట్టుమీద కూర్చొని చుట్ట కాల్చుతున్న రాయుడమ్మ రైతుచేత క్షణక్షణం చీవాట్లు తింటున్నాడు కోటిలింగం. రైతు సుల్తాన్ - "తేరగా కబుర్లు జెప్పట మనుకొంటివిటోయ్ సాలాయనా. నడుం వంచు, అడ్డెడు గింజలు వుత్తి పుణ్యానికి రావు. అంత వళ్లుగందేవాడివి కూలి కెందుకొచ్చా? బట్టలు నేసుకోపోయినా?" అని రెట్టిస్తునే చుట్ట కాల్చివేశాడు. పక్కన నోరులేని బ్రాహ్మల పొలాలగట్లు గదుముకొని, అడ్డం వచ్చిన మాలపకీరుమీద దొంగకేసు బనాయించి జైల్లోతోసి, మునసబును కూడగట్టుకొని మొత్తానికి ఆ పొలమంతా పొగాకు - పొర ధరకు తను కట్టుకొని- రాయుడమ్మ ఆ గట్టుమీదినుంచి ఈ గట్టుదాకా దృష్టి సారించి తృప్తిపొంది వూరుకోలేదు. చుట్టపీక అవల పారేసి, చేలోకి దూకి, కోటిలింగం చేతిలో కొడవలి లంకించుకొని, అతన్ని మెడమీద చెయ్యివేసి గెంటి - "వట్టి ముదనష్టం బాపతు. పో, పో, నీకు మద్దినాల తిండి బోయటం గూడా శుద్ధ దండగైంది. ఎవర్రా అంకొ, వీడ్ని బిలుచుకొచ్చింది?" అని తన జీతగాడిమీద తిరిగినాడు.

కోటిలింగం ధాన్యపు సుల్తాన్‌తో కలియబడబోయినాడు. మిగతా కూలీలు అడ్డువచ్చి అతన్ని మెల్లగా పంపివేశారు. 100 నెంబరు నేసినహస్తాలు! పాప్లయిను చూసి తిరిగి మగ్గంమీద నేసిన హస్తాలు! వంకర పూజల చిలక జరీగళ్ల చీరెలు మురిపెంగా తన యింటినుండి అమ్మకంచేసిన హస్తాలు. ఆ హస్తాలు దేనికి - యీ నవాబుకు? ఆ హస్తాలు విరిగిపోయినాయ్. ఆ మగ్గమూ మాయమైనది.

(ఇంకా వుంది)

★ ఓడలు - బళ్లు ★

(23 వ పేజీ తరువాయి)

మనిషి, మాణిక్యం మాణిక్యంగాక మసిబొగ్గలాగొతుంది?"

"ఏమి బంధుప్రేమ! ఏమి ఆదరణ!!" అని ముక్కుమీద వేలేసుకున్నారు రాక శాస్త్రిగారు.

"ఆవిడ కేవలం సుగుణాలరాశి అంటే నమ్మ..."

"ఆవిడచేతి కెక్కడా ఎముక లేదుగదా! గుప్తదాత."

"సాక్షాత్తు అన్నపూర్ణాదేవి."

"బ్రాహ్మణులందరికీ కొక్కసు కాసులేగా పంచిపెడత! ప్రతి బ్రాహ్మణుడికీ తలో కాసు, జామారు, పనసపండు, గుమ్మిడికాయ, గంధపుచెక్కకీ తక్కువ లేకుండా ఇచ్చారా పుణ్యదంపతులు...ఈ పదహారురోజులు ఎవరింట్లోనూ పొయ్యిలో నిప్పెసుకో లేదుగదా!"

"అంతేనా! ఘనాపాఠీలందరికి శాలువలు కప్పి నూటపదహార్లిచ్చారు."

"ముష్టివాళ్ళందరికీ ముంతలకి ముంతలే అందించేశారు. వాళ్ళకికూడా వస్త్రదానం చేశారు."

"ఏజన్మలోనో ఇంత ఆచేతా ఈచేతా పడేసుకున్నారు. ఈజన్మలో అనుభవిస్తున్నారు."

"ఈ జన్మలోను ఇంత చూసీ చూడక ఎడంచేత్తోటీ కుడిచేత్తోటీ పడేసుకుంటున్నారు! మళ్ళిజన్మలో ఏమైపుడతారో !"

"కేవలం దేవతాస్వరూపులు, వాళ్ళకి ఇంకా మళ్ళి వేరే జన్మంటూ ఉంటుందాంట! ఏదో శాపవశాత్తు యిలా జన్మించి ఉంటారు!"

"ఇంత ఉండగానే సరిటయ్యా! దానగుణంగూడా ఉండాలి..."

"మరే మొన్న జిల్లాజడ్జీగారమ్మాయి పెళ్ళి చూశారా! 25 వేలు కట్నం క్రిందిచ్చి అల్లుణ్ణి అమెరికా పంపుతాడుట చదువుకి. అందుకని పిల్లికి భిక్షం పెట్టలేదు సరికదా! గ్రామఫోన్ రికార్డు పెట్టి డుండుం లాడించేశాడా పెళ్ళి కొస్తాను. ఒకముద్దా ముచ్చటా?"

"అయ్యయ్యో! ఆ వేళ పెళ్ళినాడు ఒక బీదబ్రాహ్మణుడు జడ్జీగారింటికి పిలవని పేరంటం చేశాడుట. విస్తరిముందు కూర్చున్న విప్రుణ్ణి మెడట్టుకు గెంటాడుట మాడుర్ముహూముల వేళ.......వినాశకాలే విపరీతబుద్ధిః"

"ఇలాంటివాళ్ళుండబట్టే కాలం యిలా కాలిపోతూంది."

"కట్నమిచ్చి కన్యాదానం చేసి చేతులు

★ [illegible] ★

దులుపుకు కూర్చున్నారు బాపిరాజుగారు. బాకీలన్నీ వసూలైయ్యాయి. బ్యాంకిలన్నీ ఖాళీలయ్యాయి. నిలవ సొత్తంతా నిర్మూలమైంది. కట్టుకున్న భార్య, కొనుక్కున్న ఇల్లు, చేస్తూన్న ఉద్యోగం, తనూ తప్ప ఆర్జనంతా అంతమైంది. కానీ అన్నంకుండ మాత్రం తెరుగంటలేదు. అంతా ఆప్తబంధువులే. ఎవర్ని కాదంటారు? బాపిరాజుగారి ఆర్జన అడుగంటినా, మాణిక్యమ్మగారి సత్తువ సన్నగిల్లినా చుట్టాలుమాత్రం చూరట్టుకు వేళ్ళాడ్డం మానలేదు. అక్కరకురాని చుట్టాలంతా అరుగులకి అతుక్కుపోయారు.

సంసారంతో సగ్గు మణిగింది. ఏకైక పుత్రికను ఏనాడో అత్తారింటికి పంపించాడు. బాపిరాజుగారు స్వయంకృషివల్లే చదువుకుని సముద్రాన్ని కొంగిగాడు. అందులోను లేక లేక తపించగా వార్ధక్యం సమీపించే దశలో కలిగిన సంతానం కాబట్టి. పుట్టినప్పటినుంచి బాపిరాజుగారి భాగ్యం అందుకుంది. కానీ భాగ్యాన్ని భద్రపరచాలన్న బుద్ధి లేకపోయింది. ఆదాయానికి మించిన ఖర్చు చేసి అప్పులపాలయ్యారు. అమ్మాయి పెళ్ళితోటి భాగ్యమంతా కరిగిపోయింది. అమ్మాయి తోటే అత్తారింటికి అంగలేసింది భాగ్యం.

బాపిరాజుగారు,మాణిక్యమ్మ అమ్మాయిని అత్తారింటికి సంపేసి దుఃఖంచేత దూరప్రయాణం సాగించారు. ఇల్లు తాకట్టు పెట్టి యాత్రలకి బయలుదేరారు. చుట్టాలంతా చురచురలాడారు. మూడునెలలు యథేచ్ఛగా యాత్రలు సేవించి ఇల్లు చేరుకున్నారు. నోములు, వ్రతాలు, దానాలు ధర్మాలు, పూజలు పునస్కారాలు, సప్తాహాలు, భజనలు, సంతర్పణలు సమారాధనలు వెనకాముందూ చూడకుండా వెచ్చించి వేశారు.

పుణ్యకార్యాల్లో పడి ప్రాక్టీసు తగ్గించుకున్నారు. ప్రాక్టీసు పోగానే పైసలు శూన్యమయ్యాయి. పైసలు తగ్గగానే అప్పులబాధ అధికమైంది. బంగళా అమ్మేసి అప్పుల బాధ బాపుకున్నారు. పువ్వులమ్మిన ఊళ్ళో కట్టెలమ్మడం ఇష్టంలేక స్వగ్రామం చేరారు. చిన్నం కొద్దిగా మిగిలితే అమ్మి పర్ణకుటీరం నిర్మించుకుని వానప్రస్థాశ్రమం పుచ్చుకున్నారు, పురాణకాలక్షేపం చేసుకుంటూ, నిర్మలమైన ప్రదేశంలో నిశ్చింతగా. వియ్యాలవారు తమ హోదా లేని సంబంధం చేసుకున్నామని తప్పపడి పిల్లని పుట్టింటికి సంపడం మానేశారు. బాపిరాజుగారు జీవసమాధిలో నుండి చింతించేవారు కారు. కానీ మాణిక్యమ్మగారు మాత్రం కన్నకడుపు కాబట్టి అప్పుడప్పుడు కళ్ళనీరు పెట్టుకునేవారు.

బాపిరాజుగారికి అవసానకాలం ఆసన్నమవడంవల్ల పక్షవాతం వచ్చి మంచాన బడ్డారు. పాపం మందు తెచ్చే దిక్కుకూడా లేకపోయింది. పల్లెటూరవడంచేత, అంగబలం అందుబాటులో లేకపోవడంచేత, చాలినంత ధనం దాచకపోవడంచేత, వైద్యసహాయానికీ మందులకీ కరువైపోయింది. కడుపున కలిగిన కన్నబిడ్డకూడా కళ్ళమాపులకి కరువైపోయింది. పండిపోయిన పండు రాలిపోయింది. బాపిరాజుగారు కళ్ళు మూయగానే చుంచుల్లా చూరట్టుకు వేళ్ళాడిన చుట్టాలంతా చూపులకైనా కనబడలేదు. స్నేహితులంతా సన్నగిల్లారు. కష్టాలు పరంపరలన్నట్లు; వార్ధక్యం దారిద్ర్యం. బంధువులంతా తప్పుకున్నారు. మాణిక్యమ్మగారు మనోవ్యాధతో క్రుంగిపోయింది. బంధువులంతా బంధకాళ్ళయ్యారు. చుట్టాలంతా దొంగలయ్యారు. దేవుళ్ళంతా దెయ్యాలయ్యారు.

వియ్యాలవారికి ఎన్ని కబుర్లుపంపినా వారి పత్తాలేదు. పంతులుమాత్రం ప్రమాదవశాత్తు పరుగెత్తుకొచ్చాడు, పరమాన్నం జుర్రుకుందామని. పదిరోజులు కానిచ్చి పిన్నమ్మ నోదార్చాడు. ఉన్న పుస్తె పూస హుళక్కిచేసి కర్మకాండ కానిచ్చాడు. జిగినీ గొలుసు జీర్ణమైపోయింది. ఆ సైపంక్కి కోసగం అలమటించి పోయాడు. ఉన్నదంతా హుళక్కైందని తెలిసి అప్పులు చేసేశాడు. ఉన్న కాస్త యిల్లు అమ్మేసి అప్పులు తీర్చేసి మిగిలైనంత చేజిక్కించుకుని పరారయ్యాడు. జిగినీ గొలుసు తీసికెళ్ళి జీవనాధారం చేసుకుని మేడలు కట్టుకున్న పంతులుకి పిన్ని పీసుగింది. నిరాధారంగా నిలబడ్డ ఆమె దీనస్థితి చూచి బూరెలుతిన్న పురజనులంతా బుగ్గలు నొక్కుకున్నారు. వార్ధక్యంలో వైధవ్యం వెంటాడినందుకు, దానికితోడు దారిద్ర్యం ఆవిడ్ని వహించేస్తూంది. ఊరివారు ఉద్ధరిస్తారా? ఆత్మబంధువులు ఆదరిస్తారా? కన్న కూతురుకోసరం కలవరించి పోయింది. వృద్ధాప్యంవల్ల కళ్ళు మసకలు క్రమ్మాయి.

వియ్యాలవారి ఊరు బయలుదేరింది. ఇంటికి తాళం. నీరసంతో నిలువునా నీరైపోయింది. నడుం విరిగిపోయినట్లైంది. ఊరంతా కలియదీసింది. అల్లుడు అమెరికా వెళ్ళాడని కూతురుకి పురిటిరోజులని వియ్యాలారంతా ఢిల్లీలో పెద్దబ్బాయిగారింట్లో నే మకాం పెట్టేశారనీ తెలిసింది. వార్ధక్యం వెంటాడినా, వయస్సు మళ్ళినా, కష్టాలు కలవరపరచినా కడుపుమాత్రం కట్టుకోలేక పోయింది. కర్తవ్యం కనబడలేదు. ఒక గొప్ప ప్లీడరుగారింట్లో వంటకి కుదిరింది. అమ్మాయి వివాహానికి నెలలతరబడి మేసిన మేధావులంతా ఆవిడ్నిచూసి బుగ్గలు నొక్కుకున్నారు. సాయంకాలం కాలవగట్టుమీద విచారణ సాగించారు.

"ఎలాంటివాళ్ళ కెలాంటి గతి పట్టిందో చూశావా? కాలవశాన్ని బళ్ళోడలు ఓడలు బళ్ళూ అవుతూంటాయి సుమా!"

"కాకపోతే! కలిమేమి ఎలకాలము కులగిరులా, కదలకుండా? ఎల్లకాలం ఒక్కళ్ళే ఉట్టికట్టుకు ఊరేగుతారటోయ్!"

"ఊరేగడం కాదు గానీ! మాణిక్యమ్మగారు ప్లీడరుగారింట్లో వంటకి కుదిరిందిట!"

"ఆ! ఏమి టేమిటి!! మాణిక్యమ్మగారే!"

"అయినా అంత విరగబాటా!"

"అయినా తనకు మించిన ధర్మమేమిటి చెప్పూ! ఆ కూతుర్ని వాళ్ళు పంపడం మానేశారుట గా!"

"ఆఁ! ఈ ఇసేటంతా పూరికే పోతుందనా! వచ్చేం జేయ్యాలి? వాళ్ళకి అప్రతిష్ఠ కాదూ! జమీందారులాయె!"

"మహాబాగా అయిందిలే! తగిన శాస్తి జరిగింది. లేకపోతే ఆవేళ వెధవముండని పెళ్ళాడిన శంకరయ్య కొడుకు శాస్త్రి తనేందుకు పెత్తనం పెంకులు చెయ్యడం? బ్రాహ్మలంతా వెలివేస్తే తను ఒంటెద్దు... పూటకి గతిలేని వాళ్ళకి సహాయపడతాడా? ఆవేళ అందరి నోళ్ళూ ఓబ్బు పెట్టి కట్టగలిగాడు. కానీ... ఇప్పుడేం చేస్తాడు?"

"తను పర్వత కుండటికి మూడేకాళ్లనే వాడు. ఉత్తి మొండిమనిషి. పేరయ్య కూతురు పెళ్ళికి కట్నం సర్దుబాటు కాకపోతే వెయ్యినూటపదహార్లు అర్పించుకున్నాడు."

"ఓ తెలిశాయా, ఒక నోటూ, ఒక తాకట్టూ... అంతా ఎగ్గొట్టాడుగదా! బుద్ధిః కర్మానుసారిణీ అని, అవిడ ప్రాత ఇలాగుంటే ఎవరు తప్పించగలరు?"

ప్లీడరుగారు కుటుంబంతో సహా యాత్రలకి బయలుదేరారు. మాణిక్యమ్మగారు కూడా ఢిల్లీలో కూతుర్ని చూడాలన్న ఉద్దేశంతో ఉత్సాహపడింది. కానీ కాశీ చేరే లోపలే కన్ను తెరవకుండా జ్వరం వచ్చింది. కాశీ చేరగానే కూతుర్ని స్మరించుకుంటూ తుది నిద్రలో లీనమైపోయింది.

★

Edited Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras